


పోలింగ్‌కు సర్వం సిద్ధం: జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 135 ఎడిటర్: నయింపాషా పేజీలు - 05 రూ - 03/- సోమవారం 13 మే 2024


## గాలివానతో పంటనష్టంపై
# సీఎం రేవంత్ ఆరా..

**- తడిచిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు..!**



**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు.ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని ఆ జిల్లా అధికారులను ఆదేశించారు.ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని సీఎం హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.



# నేడే లోక్‌సభ పోలింగ్

- ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్
- పోలింగ్ స్టేషన్‌లకు తరలిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- వలస ఓటర్ల రాక
- పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై కేంద్ర బలగాల నిఘా
- మహబూబ్‌నగర్ పరిధిలో 31 మంది.. నాగర్‌కర్నూల్ పరిధిలో 19 మంది పోటీ

**మహబూబ్‌నగర్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు నెల రోజులుగా హోరెత్తించిన ప్రచారానికి తెర పడింది. నువ్వా.. నేనా.. అన్నట్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. సవాళ్ళు.. ప్రతి సవాళ్లు చేసుకున్నారు. సై అంటే సై అన్నట్లు ఎన్నికల కురుక్షేత్రంలో తలపడ్డారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియగా.. నేడు సోమవారం మరికొద్ది సేపట్లో ఓటింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా కేంద్రాలకు కేటాయించిన సిబ్బందిని, ఎన్నికల సామగ్రి ఈవీఎంలు,

వివరాలు 2లో


# నేడు చింతమడకకు కేసీఆర్..

**- ఓటుహక్కు వినియోగించుకోనున్న గులాబీ బాస్**



**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు దంపతులు సోమవారం స్వగ్రామం చింతమడకకు వెళ్లనున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేసీఆర్, శోభ దంపతులు ఓటు వేయనున్నారు. ఎర్రవెల్లి నివాసం నుంచి సోమవారం చింతమడకకు బయలుదేరి వెళ్తారు. ఉదయం 11.00 గంటలకు చింతమడక గ్రామంలో కేసీఆర్ దంపతులు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారు.పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాల్గో దశ పోలింగ్ సోమవారం జరుగనున్నది. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలతో పాటు కంటోన్మెంట్ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధం చేసింది. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మినహా మిగతా ప్రాంతాల్లో 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 1.90లక్షల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారని.. 161 కంపెనీల కేంద్ర సాయుధ దళాలు, పారా మిలిటరీ బలగాలతో మొత్తం 70వేల మంది సిబ్బందిని ఎన్నికల్లో భద్రత కోసం మోహరించినట్లు ఈసీ తెలిపింది.

# సిఎఎను ఎవరూ ఆపలేరు: ప్రధాని మోడీ



**బరాక్‌పూర్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ) అమలును ఎవరూ ఆపలేరని ప్రధాని మోడీ అన్నారు. తాను ఉన్నంత వరకు సిఎఎను రద్దు చేయనివ్వనని చెప్పారు. ఆదివారం పశ్చిమ బెంగాల్ లో మోడీ పర్యటించారు. నార్త్ 24పరగణ జిల్లాలోని బరాక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, హిందువులను సెకండ్ క్లాస్ సిటిజన్లుగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అవినీతికి కేంద్రంగా మారిందని ఫైరయ్యారు. చొరబాటు దారులను టిఎంసి కాపాడుతుందని పిఎం చెప్పారు. రాష్ట్రంలో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ కేసుల ప్రజల నుండి టిఎంసి దోపిడీ చేసిన డబ్బును చట్టబద్ధంగా తిరిగి ప్రజలకు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారు. అవినీతి నేతలను వదిలిపెట్టబోమని ప్రధాని హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లోని 8 లోక్‌సభ స్థానాలకు మే 13న నాలుగో దశ ఎన్నికల్లో ఓటింగ్ జరగనుంది.



# కేజ్రీవాల్ గ్యారంటీలు

**న్యూఢిల్లీ,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 10 ఎన్నికల గ్యారంటీలను ప్రకటించారు. ఒకవేళ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఈ గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. తానిప్పటి వరకైతే ఈ గ్యారంటీల గురించి ఇండియా బ్లాక్ సహచరులతో నైతే చర్చించలేదన్నారు. కానీ ఇండియా బ్లాక్ లోని ఏ నాయకుడు వీటి వల్ల సమస్యను ఎదుర్కోబోడని అన్నారు.లోక్ సభ ఎన్నికలు ఇంకా జరగాల్సి ఉన్నప్పటికీ ఆప్ 22 స్థానాల్లో 18 స్థానల నుంచి పోటీచేయనున్నదని తెలిపారు. ఆప్ ఢిల్లీ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి 13, హర్యానా నుంచి ఒక స్థానానికి పోటీచేయబోతోందన్నారు. 'మోడీ గ్యారంటీలకు పోటీగా కేజ్రీవాల్ గ్యారంటీలు ఉంటాయి' అని ఆయన వివరించారు. ఆదివారం ఆయన న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ ఈ విషయాలు చెప్పారు.


వివరాలు 2లో

# సంక్రాంతి రికార్డ్‌ను బ్రేక్ చేసిన టిఎస్ ఆర్టీసి

**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల వేళ ప్రయాణికుల తాకిడితో టిఎస్ ఆర్టీసి సంక్రాంతి పండుగ రికార్డ్‌ను బ్రేక్ చేసింది. ఈ విషయాన్ని టిఎస్ ఆర్టీసి ఎండి సజ్జనార్ తెలిపారు. సంక్రాంతి కన్నా 10 శాతం పైగా ప్రయాణికులు ఆర్టీసి బస్సులను వినియోగించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆర్టీసి బస్సుల్లో 1.42 లక్షల మంది ప్రయాణించగా ఇందులో ఎపికి 59,800 మంది ప్రయాణం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం పోలింగ్ జరుగనుండడంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగి అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల లోక్‌సభ పరిధిలో నివాసం ఉండే సెటిలర్లు అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎపికి బయలుదేరి వెళ్లారు.



# రోడ్డు ప్రమాదంలో ప్రముఖ సీరియల్ నటి మృతి



**మహబూబ్‌నగర్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శేరిపల్లి బి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో బుల్లితెర నటి పవిత్ర(42) చనిపోయారు. కర్నాటకలోని తన సొంతూరు వెళ్లి హైదరాబాద్‌కు వస్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన అనంతరం ఎదురు గా వస్తున్న ఆర్‌టిసి బస్సును ఢీకొట్టడంతో ఆమె ఘటనా స్థలంలోనే చనిపోయారు. త్రినయని అనే సీరియల్‌లో ఆమె మహిళా విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆమె డ్రైవర్ శ్రీకాంత్, బంధువు ఆపేక్ష, తోటి నటుడు చంద్రకాంత్ కూడా గాయపడ్డారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడిన సిఎం రేవంత్

# కేజ్రీవాల్ గ్యారంటీలు

(మొదటి పేజీ తరువాయి)

**అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన గ్యారంటీలలో**

**విద్యుత్తు:** దేశవ్యాప్తంగా 24 గంటలపాటు విద్యుత్తు. మేనేజ్మెంట సరిగా లేనందువల్లే విద్యుత్తు కోతలు ఏర్పడుతున్నాయన్నారు. మేము విద్యుత్తు కోతలను ఢిల్లీ, పంజాబ్ లో నివారించాము. ఇక దేశ వ్యాప్తంగా కూడా నివారిస్తాం అన్నారు.**విద్య:** అందరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తాం. పిల్లలకు చదువు అందితేనే దేశం ప్రగతి సాధించగలదు అన్నారు. నేడు పాఠశాలల్లో పరిస్థితులు నాసిరకంగా ఉన్నాయన్నారు. **అందరికీ వైద్యం:** సమాజంలోని ప్రతి ఒక్కరికీ వైద్యం అందేలా చూస్తామన్నారు. గ్రామాల్లో, మారుమూలల్లో మొహల్లా క్లీనిక్ లు నడుస్తున్నాయన్నారు. జిల్లా ఆసుపత్రులను మల్టీ–స్పెషాలిటీ ఆసుపత్రులుగా మలుస్తామన్నారు. దేశమంతటా హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామన్నారు.**చైనా ఆక్రమణకు పరిష్కారం:** మన సరిహద్దులో చైనా ఆక్రమణలకు శాశ్వత పరిష్కారం కనుగొంటాం. దేశం సర్వప్రథమమైంది. చైనా ఆక్రమిస్తున్నా కేంద్రం మాత్రం మన భూభాగంలోకి ఎవరూ రాలేదంటోంది. శాటిలైట్ల ఇమేజ్ లు లభించే యుగం ఇదని ప్రపంచానికి తెలుసు.**అగ్నివీరులకు శాశ్వత పోస్టింగ్‌లు:** కాంట్రాక్టు పద్ధతిలో అగ్ని వీరులను తీసుకునే విధానాన్ని రద్దు చేసి వారికి పర్మనెంట్ ఉద్యోగాలు ఇస్తామన్నారు. జీతాల భారానికి వెరచి కేంద్రం ఈ విధానాన్ని తెచ్చిందన్నారు. దేశ రక్షణకు మనం ఎంతైనా ఖర్చు చేయాల్సిందేనన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు.**రైతులకు హామీలు:** స్వామినాథన్ రిపోర్టు ఆధారంగా రైతుల పంటకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. రైతులు గౌరవంగా జీవించే వసతి కల్పిస్తామన్నారు.**ఢిల్లీకి రాష్ట్ర హోదా:** ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను కల్పిస్తామన్నారు.**ఉపాధి:** ఉపాధిని కల్పిస్తామన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చేందుకు సమగ్ర ప్లాన్ ను ఆయన ప్రజెంట్ చేశారు.**అవినీతిపై విరుచుకుపడతాం:** నిజాయితీ కల వారిని జైలుకు పంపే స్థితి ఇప్పుడుంది. పైగా అవినీతి పరులను రక్షించే వ్యవస్థ ఉంది. మన దేశంలో అవినీతి ఎక్కువ ఉండడానికి కారణమిదే.**వ్యాపారుల కోసం చర్యలు:** జిఎస్ టిని సులభతరం చేస్తామన్నారు. న్యాయంగా వ్యాపారం చేయాలనుకున్నవారికి పరిస్థితులు అనుకూలంగా ఉండాలన్నారు. మా లక్ష్యం చైనాను అధిగమించడమే. తయారీ, అమ్మకం విషయంలో ఆ దేశం మన కన్నా ముందుంది. వ్యాపారులు సులభంగా, బహిరంగంగా తమ వ్యాపారం చేయలేకపోవడమంటే అది దేశ ప్రగతికే అడ్డంకి.గత 8 నుంచి 10 ఏళ్లలో హై నెట్ వర్త్ ఉన్న 12 లక్షల మంది తమ వ్యాపారాలు మూసేసుకుని దేశం వదిలిపోయారని కేజ్రీవాల్ తెలిపారు.ఎందుకంటే వారిని ప్రభుత్వం వేధించింది కనుక అన్నారు.

# పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. 20 మందికి గాయాలు



**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన బూర్గంపాడు మండలం మోతె గ్రామ శివారులో చేటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స కోసం బూర్గంపాడు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మోడీకి 'మదర్సడే' బహుమతులు

**కోల్‌కతా,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోడీ తన తల్లి దివంగత హీరాబెన్ పటేల్‌తోఉన్న రెండు చిత్తరువులను అభిమానులు మోడీకి అందజేశారు. ఐదో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని హుగ్లీలో ఆదివారం నాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ ఫోటోలను అభిమానులు ప్రదర్శించడంతో మోడీ ఉద్వేగానికి గురయ్యారు. పశ్చిమ దేశాల్లో ప్రజలు ఈరోజును మాతృదినోత్సవంగా జరుపుకొంటారు. మనం మాత్రం ఇక్కడ మనతల్లిని, దుర్గామాత , కాళీమాత, భరత మాతలను 365 రోజులూ ఆరాధిస్తాం అని మోడీ ఈ సందర్భంగా మాతృదినోత్సవ ప్రాధాన్యతను గుర్తు చేసుకున్నారు.





# నేడే లోక్‌సభ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

వీవీపాట్‌లను పంపించారు.

### ఓటరు నాడిపై టెన్షన్

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలలో ఓటరు నాడి ఎటువైపు ఉంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 31 మంది, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు 19 మంది అభ్యర్థులు తలపడు తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటుబీఎస్పీ,స్వతంత్రులుకూడా జోరుగా ప్రచారం నిర్వహించారు.

### ఓటర్లు ఇలా..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,80,348 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 8,20,016 కాగా, మహిళా ఓటర్లు 8,48,289 మంది ఉన్నారు. ఇతరులు 43 మంది ఉన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో 1,937 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,34,773 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,64,034 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8,70,694 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. ఇక్కడ 1,944 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు.

### తరలివస్తున్న వలస ఓటర్లు

ఎన్నికలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో వలస ఓటర్లను రప్పిస్తున్నారు. రాను, పోను చార్జీలు ఇస్తామని హైదరాబాద్, ముంబై వంటి నగరాల్లో ఉన్న ఓటర్లను పిలిపిస్తున్నారు. అందుకోసం స్థానిక నాయకులతో మాట్లాడుతున్నారు. దీంతో ఆదివారం చాలామంది వివిధ ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు సొంతూళ్లకు చేరుకున్నారు.

### ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఎదిర గ్రామస్థుల నిర్ణయం

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డుకు చెందిన ఎదిర గ్రామస్థులు పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌ను బహిష్కరించాలని నిర్ణయించారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న అమర్‌రాజా బ్యాటరీల పరిశ్రమ వల్ల కాలుష్యం వెదజల్లితే తమ గ్రామం పాడవుతుందని చాలా రోజులుగా గ్రామస్థులు ఈ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారు. అమర్‌రాజా పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో 58 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారు. పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎన్నికల ప్రచారం కూడా జరగడం లేదు. ఎదిరలో 94, 95, 96 బూత్‌లు ఉన్నాయి. 94వ పోలింగ్ బూత్‌లో 1,125 మంది ఓటర్లు ఉన్నారు. 95వ బూత్‌లో 1,350 మంది, 96వ బూత్‌లో 764 మంది చొప్పున మొత్తం 3,299 మంది ఓటర్లు ఉన్నారు. నేడు ఓటింగ్ సందర్భంగా ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

### భారీ పోలీస్ బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికలకు భారీ పోలీస బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను మోహరిస్తున్నారు. రెండు పార్లమెంట్‌ల పరిధిలో దాదాపు ఏడు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అందులో వెయ్యి మంది వరకు కేంద్రబలగాలు ఉన్నాయి. కర్ణాటక నుంచి కూడా కొన్ని బలగాలను రప్పించారు. అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పోలింగ్ స్టేషన్‌లకు 100మీ దూరంలో ఎవరూ గుంపులుగా ఉండటానికి వీలులేదు. పోలింగ్ నిర్వహణ అనంతరం ఈవీఎంలు, వీవీపాట్ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలిచ్చారు. డీఐజీ, ఎస్పీలు బందోబస్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

### కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగనుండటంతో సిబ్బంది ఆదివారం సాయంత్రమే సామగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్‌లకు బయలుదేరి వెళ్లారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఈవీఎం, వీవీపాట్, ఇతర సామాగ్రి అందజేశారు. 32 బస్సులలో పోలీస్ బందోబస్తుతో వారిని బూత్‌లకు తరలించారు. కలెక్టర్ రవిగుగులోత్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగేలా యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఉదయం 5:30 గంటలకల్లా అధికారులు పోలింగ్ స్టేషన్‌లకు చేరుకుని మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ సమయంలోగా ఎవరు వచ్చినా వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల అనంతరం పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎం, ఎన్నికల సామగ్రిని పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, పోలీసులు ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ట్రైనీ కలెక్టర్ పాల్గొన్నారు.పట్టణంలోని టీడీగుట్టలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ ద్వారాన్ని పూలతో డెకరేషన్ చేసి, గ్రీన్‌మ్యాట్ పరిచారు.

---

# ఎన్నికల డబ్బు నిల్వ చేశారంటూ సిద్దిపేట బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద పోలీసుల దాష్టీకం..!




**సిద్దిపేట,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిద్దిపేటలోని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు, దళిత నాయకుడు జువ్వన్న కనకరాజు ఇంట్లో డబ్బులు నిల్వ చేశారని ఫిర్యాదు రావడంతో ఆయన ఇంటిని పోలీసులు సీజ్ చేశారు. అంతకు ముందు కనకరాజు అనారోగ్యంతో ఉన్న తన భార్యకు వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోదా దవాఖానకు వెళ్లారు. ఈ విషయమై పోలీసులు సంప్రదించినప్పుడు ప్రస్తుతం తన భార్య అనారోగ్యంతో ఉండటంతో హైదరాబాద్ వచ్చానని, పోలీసు అధికారులకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. కానీ ఇంట్లో ఎవరూ లేని వేళ కనకరాజు ఇంటిని సీజ్ చేసిన పోలీసులు.. పహారా ఏర్పాటు చేశారు.హైదరాబాద్ నుంచి వచ్చిన కనకరాజు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఇంటి తాళాలు తీయాలని కోరినా పోలీసులు వినిపించుకోలేదు. అనారోగ్యంతో ఉన్న కనకరాజు భార్యను, ఇతర కుటుంబ సభ్యులను ఇంటి బయటే రెండు గంటల పాటు నిలబెట్టి కాలయాపన చేశారు. నా ఇంటి తాళం తీయండి. అధికారులకు పూర్తిగా సహకరిస్తాను అని కనకరాజు వేడుకున్నా పోలీసులు కనికరించకుండా దాదాపు రెండు గంటలు ఆలస్యం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ఇబ్బందులకు గురి చేశారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు భారీగా కనకరాజు ఇంటి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడు పోలీసులు కనకరాజు ఇంటి తాళాలు తొలగించి, లోపల పూర్తిగా తనిఖీ చేశారు. ఇంట్లో దేవుని గల్లాలో వేసిన చిల్లర నాణాలు రూ.276 మాత్రమే లభించాయి. దీంతో పోలీసులు వెనుతిరిగి వెళ్లారు.

# ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : డీజీపీ రవి గుప్తా



**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకుఅన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కు ను వినిగించుకోవాలి డీజీపీ రవి గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరాలను వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహి స్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసాం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు.

# ఖర్గే హెలికాప్టర్‌లో తనిఖీలు



**సమస్తిపూర్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):**లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రతిపక్షాలను ఎన్నికల అధికారులు టార్గెట్ చేసి మరీ తనిఖీలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెలికాప్టర్‌ను బీహార్ లోని సమస్తిపూర్‌లో పోలింగ్ అధికారులు తనిఖీ చేశారు. అయితే ఎన్డీయే కూటమి నేతలను మాత్రం ఎటువంటి తనిఖీలు చేయకుండా విడిచిపెడుతున్నారని ఎన్నికల అధికారులపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. శనివారం మల్లికార్జున్ ఖర్గే సమస్తిపూర్, ముజఫర్ పూర్ ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు.ఇప్పటికే కేరళలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. శనివారం మల్లికార్జున్ ఖర్గేను సమస్తిపూర్‌లో అధికారులచే తనిఖీ చేయించారు అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత రాజేష్ రాథోడ్ అన్నారు. బీహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఖర్గే హెలికాప్టర్ చెకె చేశారని రాజేష్ రాథోడ్ తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వీడియోలో హెలికాప్టర్ చుట్టూ అధికారులు , పోలీస్‌లు ఉండటం గమనించవచ్చు.

# ఆదిలాబాద్ జిల్లాలో విషాదం.. పిడుగుపడి ఐదుగురికి గాయాలు

**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన భీబత్సం సృష్టించింది. ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. జైనథ్ మండలం పిడుగుపాటుకు ఐదుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీ పల్లిలో పిడుగుపాటుకు తండ్రి,కొడుకు శ్రీరాములు(45), శివరాజు(15)మృతి చెందాడు. కాగా, రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# సంగారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షం.. పిడుగుపాటుకు తండ్రి, కుమారుడు మృతి

**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి, మెదక్ జిల్లాలో గాలివాన భీబత్సం సృష్టించింది. ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీ పల్లిలో పిడుగుపాటుకు తండ్రి,కొడుకు శ్రీరాములు(45), శివరాజు(15)మృతి చెందాడు. ఈదురుగాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోయాయి. నాగలిగిద్ద మండలం ముక్తాపూర్‌లో 5.1 సెం.మీ.,మొగుడంపల్లిలో 2.6 సెం.మీ., పాపన్నపేట మండలం లింగాయిపల్లిలో1.9 సె.మీ. వర్షపాతం నమోదయింది.

# విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడిన సిఎం రేవంత్



**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల ప్రచారం ముగియడంతో నేటి నుంచి తాను ఏం చేయబోతున్నానో అన్న విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సరదాగా ఫుట్ బాల్ ఆడి అందరినీ అలరించారు. విద్యార్థులతో కలిసి తాను ఫుట్ బాల్ ఆడిన వీడియోను ట్విట్టర్ వేదికగా షేర్ చేసిన రేవంత్ రెడ్డి 'నిన్నటి వరకు హోరాహోరీగా ఎన్నికల ప్రచారం సాగింది. ఇక నేటి నుంచి మళ్లీ ప్రజాసేవకు సిద్ధం అవుతుండగా సెంట్రల్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో యువ ఆటగాళ్లతో కలిసి ఫుట్‌బాల్ ఆడటం జరిగింది. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ యువత భారత పతాకాన్ని ఎగురవేయడానికి ప్రోత్సహిస్తా' అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా గోల్ వేసేందుకు సిఎం రేవంత్ పరుగులు తీశారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూస్ లేకుండానే ఫుట్ బాల్ ఆడారు. రేవంత్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీఎంఆర్ ఐఈఎస్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషి, హెచ్సీయూ ఎన్ఎస్యూఐ యూనిట్, హెచ్సీయూ విద్యార్థులు ఫుట్ బాల్ ఆడారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఏంఏ ఫహీం, టి శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి తిలకించారు. అంతకుముందు హెచ్‌సియూలో విద్యార్థులతో సిఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు వర్సిటీలో సౌకర్యాలు, ఇతర అంశాల గురించి విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

# యాదాద్రి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ



**భువనగిరి,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రిలో ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవులు రావటంతో యాద్రాద్రి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. యాదా ద్రిలో ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. యాదాద్రిలో ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పడుతోంది. స్వామి వారి ఆర్జిత పూజల్లో అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొన్నారు.

# మాదిగ జాతిని మరోసారి వంచించే ప్రయత్నం..!

**- ప్రొఫెసర్: గాదే దయాకర్**

**హనుమకొండ ప్రతినిధి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎమ్మార్పీఎస్ , భారతీయ జనతా పార్టీ మాదిగ జాతిని మరోసారి వంచించే పనిలో పడ్డాయని కాకతీయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు ప్రొఫెసర్ గాదే దయాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాదిగ ఓట్లను దండుకునే కుట్రలో భాగంగా బీజేపీ ముందుకొచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రంలో 11 నవంబర్ 2023 నాడు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో బిజెపి, ఎమ్మార్పిఎస్ కలిసి నిర్వహించిన విశ్వరూప మహాసభలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని ఆచరణకు సాధ్యం కాని హామి ఇచ్చారని, ఎస్సీ వర్గీకరణ చేయడం సాధ్యం కాదనే వాస్తవాన్ని దాచిపెట్టి వర్గీకరణ చేస్తామని, రాష్ట్ర ప్రజలను మాదిగలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని సాక్షాత్తు మోడీ క్యాబినెట్ లోని సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మినిస్టర్ నారాయణ స్వామి రాజ్యసభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకి సమాధానంగా గతేడాది జులై 27న రాజ్యసభలో ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోరికమేరకు నియమించబడిన జస్టిస్ ఉషా మేహ్రా కమిషన్ సిఫారసు చేసిన విధంగా రాజ్యాంగంలోని 341 అధికరణను సవరించి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చే విధంగా రాజ్యాంగ సవరణ చేయడం సాధ్యం కాదని మంత్రి ఏ నారాయణ స్వామి రాజ్యసభలోనే లిఖిత పూర్వకంగా ప్రకటించారు. ఎందుకనగా రాజ్యాంగంలోని 341 అధికరణం సవరించాలంటే పార్లమెంటులో 2/3 మెజారిటీతో పాటు దేశంలోని సగం రాష్ట్రాలు అట్టి రాజ్యాంగ సవరణను ఆమోదించాలన్నది రాజ్యాంగ సవరణ పద్ధతి బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని దేశంలోని మొత్తం రాష్ట్రాల అభిప్రాయాలను కోరుతూ 20 రాష్ట్రాల నుండి రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి సమాధానాలు స్వీకరించగా ఇందులో ఏడు రాష్ట్రాల నుండి మాత్రమే ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు పంపించాయి.. 13 రాష్ట్రాల నుండి మరొక కేంద్ర ప్రాంతం నుండి వర్గీకరణకు వ్యతిరేకంగా నివేదికలు వచ్చాయి. ఒక కేంద్రపాలిత ప్రాంతము మాత్రం ఇప్పటికీ తమ అభిప్రాయాన్ని స్పష్టంచేయలేదు. కేంద్ర ప్రభుత్వానికి అందిన ఈ అభిప్రాయాలు ఆధారంగా కేంద్ర ప్రభుత్వమే వర్గీకరణ సాధ్యం కాదని సదరు మంత్రి నారాయణ స్వామి రాజ్యసభలో లిఖిత పూర్వకంగా ప్రకటించడం జరిగింది. వర్గీకరణ సాధ్యం కాదనే వాస్తవాన్ని మరుగుపరిచి ఎమ్మార్పీఎస్ మరియు బిజెపి 11 నవంబర్ 2023 నాటి విశ్వరూప మహాసభలో వర్గీకరణ చేస్తామని తప్పుడు హామీ ఇచ్చి మాదిగలను తెలంగాణ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించడం జరిగింది. 2023లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మరియు నేడు జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల ఓట్లను రాబట్టుకునే ఉద్దేశంతో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వడం జరిగింది. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే దేశ సర్వోన్నత న్యాయస్థానంలో వర్గీకరణ అంశంపై ఏడుగురు న్యాయమూర్తులు విచారణకు సిద్ధమవుతున్న తరుణంలో వర్గీకరణ చేస్తామని దానికోసం కమిటీ నియమిస్తామని విశ్వరూప మహాసభలో ప్రకటించడం కోర్టు ధిక్కారమవుతుంది. దీనిని బట్టి ప్రధానమంత్రి, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ కు సర్వోన్నత న్యాయస్థానం మీద ఎలాంటి గౌరవం లేదని స్పష్టం అవుతున్నదని, గతంలో వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో 27 నవంబర్ 2016 ధర్మ యుద్ధ మహాసభలో హామీ ఇవ్వడం జరిగింది. కానీ సంవత్సరాలు గడిచినా నాయుడు, కృష్ణ మాదిగలు ఇద్దరూ కనీసం వర్గీకరణకు ప్రయత్నం కూడా చేయించకుండా మరోసారి మాదిగలను మోసం చేశారు. ఇదే మోసాన్ని మోడీ పునరావృతం చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని, గతంలో మండల కమిషన్ సిఫారసులను అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ ఉద్యమించినప్పుడు మాజీ ప్రధాని విపి సింగ్ ఆ డిమాండ్ ను సమర్థిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బిజెపి నాయకత్వంలో ఎల్ కే అద్వాని, నరేంద్ర మోడీలు మండల కమిషన్ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. నరేంద్ర మోడీ తాను సూత్రబద్ధంగా రిజర్వేషన్లకు వ్యతిరేకినని అందుకే మండల్ కమిషన్ ను వ్యతిరేకిస్తున్నట్లు ఆనాడే ఆయన కుండ బద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేస్తామనడం మోసపూరిత హామి అని అర్థం చేసుకోవాలి. అదేవిధంగా మళ్ళీ బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న ప్రభుత్వం వర్గాలు వర్గీకరణకు



పూనుకుంటామని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే అవుతుందని, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాదిగల ఉద్యమానికి స్పందిస్తూ జస్టిస్ రామచంద్రరావు నివేదిక ఆధారంగా అప్పటి టిడిపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసింది. దానిని వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాటి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. అప్పుడే వర్గీకరణ విధాన ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం పరిధినే స్పష్టమైందీ. దీనిని పార్లమెంటులో చట్టం చేయాలనే విషయం ఆనాటికే కృష్ణ మాదిగకు స్పష్టమైంది. అందుకు భిన్నంగా అప్పటి ఏపీ ప్రభుత్వంతో ఆర్డినెన్స్ జారీ చేయించి ఆ తరువాత రాష్ట్ర శాసనసభచే రద్దు చేయించడంతో కృష్ణమాదిగకు రాజ్యాంగ విలువలపై, న్యాయస్థానాలపై ఏమాత్రం గౌరవం లేదనేది రుజువైంది. వివిధ రాష్ట్రాల అభిప్రాయం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా వచ్చినా కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ద్వారా విశ్వరూప మహాసభలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధం చేస్తామనే హామీ ఇప్పించడం కూడా కృష్ణ మాదిగకు రాజ్యాంగ పద్ధతుల మీద నమ్మకం లేదని మరోసారి స్పష్టమవుతుంది. అంతేకాకుండా కొన్ని శతాబ్దాలనుంచి దళితులను వెట్టిలోకి నెట్టి అంటరానితనం అనే అమానుషత్వానికి మద్దతు పలికిన మనువాద పార్టీ బీజేపీకీ అంటకాగడం మాదిగల అస్థిత్వ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడంగాక మరేమవుతుంది. ఈ కుటిల ప్రయత్నాలను బుద్ధిజీవులైన మాదిగలు తిప్పికొట్టాలని పేర్కొన్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం: జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి

**- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి**
**- ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ములుగు, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కలెక్టర్ మీడియాకు వివరాలు వెల్లడించారు.ఓటు హక్కు వినియోగించు కోనున్న 2లక్షల 33వేల 191మంది ఓటర్లు.మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ 62 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు.అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1 మహిళా, 1 దివ్యాంగుల, 1 యూత్, 1 మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.జిల్లాలో 87 లోకేష్ లలో 258 సీసీ కెమెరాల ఏర్పాటు.భారత ఎన్నికల కమీషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నాల్గవ విడతలోమహబూబాబాద్ లోక్ సభ స్థానం ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మే 13న ములుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నదని అన్నారు. జిల్లాలో మొత్తం 2 లక్షల 33 వేల 191 మంది ఓటర్లు, 226 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. జిల్లా పరిధిలో అత్యవసర సర్వీసుల కింద ఒక ఓటర్ మాత్రమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. జిల్లా పరిధిలో ఓటర్లందరికి ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేశామని అన్నారు. ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 62 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని,ఇక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. జిల్లాలో ఎలాంటి వల్నరబుల్ పోలింగ్ కేంద్రం లేదని తెలిపారు. జిల్లాలో మొత్తం 87 లొకేషన్స్ లో 258 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. మే 13న జరుగనున్న



పోలింగ్ లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# నేడు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం...

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్**

**హనుమకొండ ప్రతినిధి, మే 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** నేడు (సోమవారం) జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎన్నికల సిబ్బందికి అందించే పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలు అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్ లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. సోమవారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. పోలింగ్ నిర్వహణకు కేటాయించిన ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు చేరుకుంటారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం వివిధ సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద షేడ్ నెట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తదితర వసతులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.'ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి" ఓటర్లు ఎన్నికల్లో తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు స్వాగతం పలికారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 244 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 2,83,446 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.





పరకాల నియోజకవర్గం పరిధిలో 239 పోలింగ్ కేంద్రాలు, 2,22,383 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని హనుమకొండ జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.'పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది" వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది పోలీసుల భద్రత మధ్య వాహనాల్లో తరలారు. ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రితో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. పోలింగ్ సిబ్బంది తరలుతున్న వాహనాల ముందు పరకాల ఏఆర్ఓ డాక్టర్ కె.నారాయణ, పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ జెండా ఊపారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి అధికారులు భోజన, టి, తదితర వసతులను కల్పించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి ఏఆర్వోలు పలు సలహాలు సూచనలు చేశారు.

## ప్రజలందరూ స్వచ్ఛందంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోండి

**పరకాల, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 71 పోలింగ్ బూతుల గాను మొత్తం 119 మంది సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. హెూం గార్డ్ టు సిఐ వరకు పోలీస్ స్టేషన్ సిబ్బంది, రిజర్వ్ ఆర్మ్డు పోలీస్ సిబ్బంది, ట్రైన్ ఆఫీసర్స్ ఉమెన్ మరియు సెంట్రల్ ఫోర్స్ అయిన బిఎస్ఎఫ్ సిబ్బంది ఈ బందోబస్తులో పాల్గొనడం జరుగుతుంది. ప్రజలందరూ స్వచ్ఛందంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరనైనది.

## రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య మీద జరిగిన దాడిని ఖండిస్తున్నాం



**హసన్‌పర్తి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రచారంలో భాగంగా బీసీల ఆత్మ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మీద జరిగిన దాడినీ తీవ్రంగా ఖండిస్తూ ఈ ఘట నకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఇలాంటి దాడులు మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కుమార్ హన్మకొండ జిల్లా జేఏసీ కన్వీనర్ మరియు జలసాధన సమితి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు డిమాండ్ చేశారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు బండారి స్వాగత్ రన్వీర్ చంద్






**పరకాల, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు(ఐ.ఏ.ఎస్) బండారి స్వాగత్ రన్వీర్ చంద్ పరకాల మండల పరిధిలోని పరకాల, నాగారం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, అదేవిధంగా వెలమ వాడ మాడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పోలింగ్ సిబ్బందిని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్, యంపిడిఓ, మునిసిపల్ కమీషనర్ లను అభినందించారు. ఆయన వెంట ఎన్నికల అధికారులు, పోలీసులు ఉన్నారు.

## పాత బస్తీలో పేలిన బైక్ పెట్రోల్ ట్యాంకర్.. పది మందికి గాయాలు..!

**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌పాతబస్తీలోని భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో టూ వీలర్ పెట్రోల్ ట్యాంక్ పేలడంతో పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను సమీప ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.మొఘల్ పురా అస్లా ఫంక్షన్ హాలు సమీపంలో రోడ్డుపై వెళుతున్న బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బైక్ మీద ప్రయాణిస్తున్న వెంటనే వాహనం నిలిపేశారు. మంటలు ఆర్పివేసేందుకు స్థానికులు గుమిగూడగానే పెట్రోల్ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న భవానీ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు.



# నూతన వస్త్రాలంకరణలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం దేశరాజు పల్లి గ్రామానికి చెందిన మడుపు ప్రకాష్ -ఆశ గార్ల కుమారై నూతనవస్త్రలంకరణ కార్యక్రమానికి హాజరైన చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రేమ వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

**గంగాధర, మే 12(పిసిడబ్ల్యూ న్యూస్):** : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని తురక కాశీ నగర్ నిన్న తేది.10-05-2024 రోజున సాయంత్రం 05.30 గంటలకి తుర్కశి నగర్ కి చెందిన వివాహితని ప్రేమ పేరుతో వేసించగా అట్టి వేధింపులు భరించలేక మంగాపేట శివారు లో ఉన్న ఒక బావి లో దూకి సయ్యద్ కరీమా ఆమె చనిపోగా ఈ రోజు ఆమె తండ్రి షేక్ చిన్న జమల్ ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఆమె మృతికి కారణం అయిన నిందితుడు సయ్యద్ ముబారక్. తండ్రి - హైదర్, 23 సంవత్సరాలు గ్రామము. తటిపెల్లి అనే వ్యక్తిని అరెస్టు చేసి ఈ రోజు రిమాండ్ కి పంపడమైనది. మరియు మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపినారు.


# ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు



**ఖమ్మం, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ఖమ్మం నగరంలో వీడియోస్ కాలనీ సాయిబాబా ధ్యాన మందిరం నందు ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ బర్డే వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఉదయం యోగ ప్రాణాయామం , సుదర్శన్ క్రియ మరియు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు . ఈ రక్తదాన శిబిరంలో సుమారుగా 40 మంది దాకా రక్తదాతలు పాల్గొని విజయవంతం చేశారు . అలాగే సాయంత్రం గురుపూజ మరియు సత్సంగ్ (భక్తి భజన) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ వెంకట్, కోటేశ్వరావు, శ్రీనివాస్, వాలంటీర్స్ వెంకట్ రెడ్డి, శ్రీలత, సత్యవతి, గోపాల్, హరి , రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**గంగాధర, మే12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధుర నగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గంగాధర ఆధ్వర్యంలో మధురనగర్ గ్రామంలో టీఎస్ఆర్టీసీ బస్టాండ్లో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది.ఇట్టి కార్యక్రమానికి లయన్ పత్రం లక్ష్మారెడ్డి లయన్ గుర్రం బాబు రెడ్డి లయన్ ఎర్రం లక్ష్మణ్ లయన్ గుడి అనంతరెడ్డి లయన్ పోలు సమ్మయ్య లయన్ వేముల మల్లేశం మరియు ట్రెజరర్ లయన్ ఆళ్ల విజేందర్ రెడ్డి జనరల్ సెక్రెటరీ లయన్, శ్రీరామ్ శ్రవణ్ పాల్గొనడం జరిగింది.




# బిజెపి, బీఆర్ఎస్‌లను ఓడించి ఇండియా కూటమిని గెలిపించండి

**- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి**




**కురవి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ సమగ్రత సమైక్యత కాపాడడానికి భారత రాజ్యాంగాన్ని పరిరక్షణకై ఇండియా కూటమిని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యాలయం కొరవిలో జరిగిన పాత్రికేయ సమావేశంలో నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బిజెపి పాలనలో దేశంలో మునిపెన్నడూ లేని విధంగా అసమానతలు పెరిగాయని కింది స్థాయిలో ఉన్న 50 శాతం ప్రజల దగ్గర కేవలం 15 మాత్రమే,10 శాతం కుబేరుల దగ్గర 65 శాతం సంపద పోగు పడటం దేశ సంపదను మోడీ కార్పొరేట్లకు కట్టబెట్టడానికి నిదర్శనమని అన్నారు. ఈ ఎన్నికలలో బిజెపి గెలిస్తే ఇక ఎన్నికలే ఈ దేశంలో జరగవని, ఒకే మతం ఒకే బాష,ఒకే ఎన్నికల పేరుతో అధ్యక్ష తరహా పాలన ప్రారంభించి నియంతృత్వ పాలన తీసుకువచ్చే అవకాశం ఉన్నందున, బిజెపి బీఆర్ఎస్ మిత్రులను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని పిలిపించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న తురక రమేష్ కన్నె వెంకన్నలు పాల్గొన్నారు.

# కొత్త ఓటర్లను ఆకర్షించుటకు యువ పోలింగ్ కేంద్రం

**- జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి. ప్రావిణ్య**




**వరంగల్ ప్రతినిధి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్త ఓటర్లను ఆకర్షించుటకు యువ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ జిల్లా కలెక్టర్/ రిటర్నింగ్ అధికారి పి. ప్రావిణ్య అన్నారు. 15- వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధి లోని 106-వరంగల్ (తూర్పు)అసెంబ్లీ నియోజక వర్గ పరిధి లో సి కే ఎం కళాశాల లో పూర్తి గా యువత చే నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం.చేస్తూ సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు నియోజక వర్గ పరిధి లో ప్రత్యేకం గా యువత తో పాటు మహిళలచే దివ్యాంగుల చే ప్రత్యేకంగా నిర్వహించబడే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సి కే ఎం కళాశాల లో పూర్తి గా యువత చే నిర్వహించేలా పోలింగ్ కేంద్రం నిర్వహించబడుతుందని, ఇందులో పూల ప్రవేశం ద్వారా ఫ్లెక్సీతో ఓటర్లకు స్వాగతం పలికే బ్యానర్ సెల్ఫీ పాయింట్‌తో పాటు ప్రవేశ ద్వారం నుండి పోలింగ్ స్టేషన్ వరకు గ్రీన్ కార్పెట్ల ఏర్పాటు బెలూన్లతో పోలింగ్ స్టేషన్ అలంకరణ సంకేతాల బోర్డుల ఏర్పాటు తో పాటు రోజ్ ఫ్లవర్స్ టేబుల్స్ బట్ట తో పూర్తిగా కప్పబడి ఉంటాయని పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో పాటు వారికి వాష్ రూమ్స్ ల సదుపాయం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. దీనికి తోడుగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యంగా పోలింగ్ కేంద్రం, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఒక యువ పోలింగ్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో వరంగల్ జిల్లా సీపీ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి డి ఆర్ డి డి పి ఆర్ ఓ అయుబ్ అలీ, డిఆర్డీఓ కౌసల్య, డి ఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కనిలాల్ నాయక్‌కు నివాళు లర్పించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**నల్లగొండ,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ తండ్రి కనిలాల్ నాయక్ తండ్రి పార్థివ దేహానికి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులుఅర్పించారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కనిలాల్ నాయక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కనిలాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రవీంద్ర కుమార్‌ను ఓదార్చారు.



# రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యపై దాడి దుర్మార్గం..!

**- దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్,హన్మకొండ జాతీయ బీసీ**



**హనుమకొండ ప్రతినిధి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య రాయితో దాడి దుర్మార్గమని, బీసీలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, ఇలాంటి దాడులతో బీసీల ఐక్యతను విడదీయలేరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ ఒక ప్రకటనలో అన్నారు. ఆదివారం హనుమకొండ లో ఆయన మాట్లాడుతూ.. ఆర్ కృష్ణయ్య ఆంధ్రాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం లో గురువారం ప్రచారం చేస్తుండగా గుర్తుతెలియని దుండగుడు ఆయనపై రాయితో దాడి చేసిన ఘటనలో ఆయన వీపు పై గాయమైందని తెలిపారు. తక్షణమే పోలీసులు నిందితుని గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావతకు కాకుండా పోలీస్ అధికారులను రవి కృష్ణ గౌడ్ కోరారు.

# వీహేలో బాలవికాస్ సమ్మర్ క్యాంప్ ముగింపుత్సవం



**ఖమ్మం, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** వివేకానందా ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా జరుగుతున్నటువంటి బాలవికాస్ సమ్మర్ క్యాంప్ యొక్క ముగింపు కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్ దేవకి వాసుదేవరావు హాజరయ్యారు . బాలవికాస్ కార్యక్రమంలో యోగా, శ్లోకాలు, భజనలు , హ్యాండ్ రైటింగ్ , డ్రాయింగ్ మరియు స్వామి వివేకానంద జీవిత చరిత్ర అనే అంశాలపై శిక్షణ జరిగింది . దాంతోపాటు వ్యక్తిగత క్రమశిక్షణ , నైతిక విలువలు , పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి అంశాలను విశదీకరించడం జరిగింది . ఈ సందర్భంగా దేవకి వాసుదేవరావు మాట్లాడుతూ బాల్యంలోనే పిల్లలకు క్రమశిక్షణ మరియు ఆధ్యాత్మికత ఉంటే భవిష్యత్తులో అద్భుతమైన వ్యక్తులుగా రూపొందే అవకాశం ఉందని వారు భావిభారత పౌరులుగా దేశానికి ఎంతో సేవ చేస్తారని తెలిపారు . విద్యార్థులు నేర్చుకున్నటువంటి అంశాల పై ప్రతిభను చూపించారు . గత 45 రోజులుగా ఏసి ఇన్స్టాలేషన్ అండ్ సర్వీస్ ట్రైనింగ్ తీసుకున్న విద్యార్థులకు కూడా సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది . యువతకు సరైన శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా శక్తివంతులు చేసే విధంగా ఈ కార్యక్రమం ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు కేశవలాల్ పటేల్ , చంద్రశేఖర్ , చారి , లలిత , రాముడు , స్నేహలత , అశోక్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కి కట్టుదిట్టమైన పోలీసు భద్రతతో ఇవియంల తరలింపు

**- పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాద్ జిల్లా, మే12 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేపు జరగనున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.పోలింగ్ సిబ్బందిని తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానంతో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించి పోలింగ్ శాతం పెంచాలన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం లో సిబ్బంది కి పోలింగ్ సామాగ్రి పంపిణీ స్వయంగా పరిశీలించారు. మహ బూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందినవి తెలంగాణ సాంఘీక సంక్షేమ జూనియర్ (బాలికల) కళాశాలలో , డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం నకు చెందినవి సెయింట్ అగస్టీన్ హై స్కూల్ మరిపెడలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను ప్రశాంతంగా జరిగిందన్నారు లోక్ సభ ఎన్నికల పోలింగ్ విధులను వివిధ శాఖల నోడల్ అధికారులు సిబ్బంది ముఖ్య ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి విధులు నిర్వ హించాల్సి నదిగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ అధికా రులకు సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూం ను పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి పోలింగ్‌లో అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. రేపు జరగను న్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా (16 ) మహబూబాబాద్ పార్లమెంట్ లోని అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో డోర్నకల్ , మహబూబాబాద్, నర్సంపేట నియోజకవర్గాలలో పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, పినపాక, ఇల్లందు, భద్రాచలం,ములుగు నియోజక వర్గంలో పోలింగ్ సమయాన్ని ఉదయం 7 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ( ఈసీ) ఉత్తర్వులను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు అలాగే దివ్యంగా ఓటర్లకు ర్యాంప్ మరియు ట్రై సైకిల్ ఏర్పాటు చేయడం జరిగిందని , పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నా రు.ఎన్నికల సామాగ్రి తరలింపు ప్రక్రియలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్సల్ టోప్పో, ఆర్డీవో అలివేలు, జడ్పీ సిఇఓ నర్మద, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్-స్వీప్ నోడల్ అధికారి మరియు జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి మారియన్న, సంబంధిత నోడల్ అధికారులు,పిఓలు,ఏపీవోలు, ఓపిఓలుతదితరుల సమక్షంలో పోలింగ్ సామాగ్రి తరలింపు జరిగింది.



# పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా చూడాలి

**- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కైకన్**

**మహబూబాబాద్ జిల్లా, మే12(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల నందు గల ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మరిపెడ బంగ్లా నందు గల ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి తెలియ జేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరు వెళ్ళేటట్లు చూసు కోవాలని ,ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వ ర్తించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు కృషి చేయాలనీ తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని



తెలియజేశారు.పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు మరియు మండే వస్తువులు (అగ్గి పెట్టె,లైటర్...) లాంటి నిషేధించిన వస్తువులను ఎవరు కూడా పోలింగ్ బూత్ లోనికి తీసుకొని రాకుండా చూడాలని తెలిపారు. పోలింగ్ సాయంత్రము 06:00 గంటల వరకు ఉంటుందని ఆ తరువాత ఎవరు వచ్చిన లోపలికి పంపకూడదు అని, ఒక వేళ అప్పటికే క్యూ లో ఉంటె వారికి పోలింగ్ అధికారి టోకెన్స్ ఇవ్వడం జరుగుతుందని వారిని మాత్రమే ఒక్కరికీ ఓటింగ్ కు పంపాలని సూచించారు.పోలింగ్ కేంద్రం వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపించినా లేదా ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే రూట్ మొబైల్ ఇంచార్జి అధికారికి, స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని అందుకు సంబంధిత అధికారుల అందరి ఫోన్ నంబర్లను ఫీడ్ చేసుకోవాలని సూచించారు. ఒక్కొక అసెంబ్లి నియోజక వర్గం నకు పోలీస్ నోడల్ అధికారులు ఉంటారని అవసరమైతే సమస్యను బట్టి వారికి కూడ సమచారం అందించాలని ఆదేశించారు.శాంతియుత మరియు స్వేచ్ఛపూరిత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది కృషి చేయాలని అదేవిధంగా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# భారీ పోలీసు భద్రత మధ్య ఈవిఎంల తరలింపు

**- ఓటే మీ ఆయుధం - ధైర్యంగా ఓటేయండి**

**- మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేక నజర్**

**ములుగు, మే 12 ( పిసిడబ్ల్యు న్యూస్):**రేపు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈరోజు ఈవీఎంలను పంపిణీ కేంద్రం నుండి జిల్లాలో గల అన్ని పోలింగ్ కేంద్రాలకు భారీ భద్రత మధ్య తరలించడం జరిగినది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఐపిఎస్ పోలీస్ అధికారులు సిబ్బంది అందరికీ భద్రత పరంగా సూచనలు అందించడం జరిగినది (బ్రీఫింగ్ ).ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో పోలీస్ అధికారిని నియమిస్తూ పంపిణీ కేంద్రం నుండి ఈవీఎంలకు రక్షణగా పంపడం జరిగినది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా శాంతియుతంగా జరిగేలా భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని ప్రతి పోలింగ్ స్టేషన్లో ఒక పోలీసు అధికారి ఉంటారని ఏటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్పందించే లాగున పెద్ద సంఖ్యలో రూట్ మొబైల్ పార్టీలను నియమించడం జరిగినదని సెక్టార్ ఇన్చార్జిలనే కాకుండా ఒక్కో ప్రాంతానికి డీఎస్పీ స్థాయి అధికారులను నియమించినట్లు తెలియజేశారు.అలాగే మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలలో భారీ మొత్తంలో కేంద్ర ఆర్మ్డ్ బలగాలు స్పెషల్ పార్టీ పోలీసుల ద్వారా భారీ భద్రత విధించామని ఎన్నికలకు ఆటంకం కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామని ఎవరికి భయపడకుండా ప్రజలందరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



# బయ్యారం మండలంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**- పోలీసు నిఘాలో ఏజెన్సీ**

**బయ్యారం, మే 12(పీసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండలం లో 8 సెక్టార్లో, 44 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగం కొరకు ఏర్పాట్లు పూర్త య్యాయని మండలంలో144 సెక్షన్, ఉదయం 7 నుండి సాయ ంత్రం 6 గంటల వరకు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.పార్లమెంట్ ఎన్నికలకు నేడు జరగబోయే ఓటింగ్ కొరకు ఓటర్లకు ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. మండలంలో 8 సెక్టార్లుగా విభజించి 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మండలానికి సంబంధించిన సుమారుగా 40,7550 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కొనుటకు అధికారులు ఆదివారం ఎన్నికల ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 29 గ్రామ పంచా యతీలకు 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో , గ్రామపంచాయతీ కార్యాల యం 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తపేటలో 8 , జగ్గుతండా జిపి ప్రభుత్వ పాఠశాలలో 4 పోలి ంగ్ బూతులు చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగతా 26 పోలింగ్ కేంద్రాలు మిగతా జీపిలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు.మండలంలో ఓటర్లు తమ ఓటు హక్కును ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకూ వినియోగించుకొనున్నారు. ఓటు హక్కును వినియోగించు కొనుటకు వచ్చే ఓటర్ల కొరకు ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడం జరిగింది.ఓటర్ల కొరకు మంచినీరు,వృద్ధుల కొరకు ప్రత్యేకంగా 'వీల్ చేర్' సదుపాయంతోపాటు ఎండ ప్రభావానికి గురికా కుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ 'టెంట్' లను మంచి నీరు సౌకర్యం ఇతర మౌళిక వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. బయ్యారం మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ట్రైనీ ఎస్పీ పండరీచేతన్,సిఐ రవికుమార్ ప్రత్యేక



బలగాల ద్వారా పర్యవేక్షించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని అధికారులు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఓటు స్లిప్పులు మండలం లో పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ఓటు హక్కు ఉందో లేదో తెలియక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు.

# పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ ప్రతినిధి, మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ తో కలసి డిస్ట్రిబ్యూషన్ పరిశీలించిన కలెక్టర్ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను తెలియజేసిన ఏఆర్‌ఓలు పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.ఆదివారం ఎనుమముల మార్కెట్ యార్డ్ లో కొనసాగుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ,బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ తో కలసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్యతో కలసి క్షేత్ర స్థాయి లో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల్లో పోలింగ్‌కు అవసరమైన సామ గ్రి తరలింపు, తీసుకురావడంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుం డా పక్కాగా విధులు నిర్వహించాలని ఎన్నికల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ జిల్లాలో ని వరంగల్ తూర్పు అసంబ్లీ సెగ్మెంట్‌లో 230 పోలింగ్ కేంద్రాలకు, మొత్తం 21 రూట్లలో వర్ధన్నపేట అసంబ్లీ సెగ్మెంట్లో 279 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 37 రూట్లలో బస్సులు రూట్‌మాప్ ఆధా రంగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లాయని, సెక్టోరియల్ అధికారుల సమక్షంలోనే ఈ బస్సులు వారికి కేటాయించిన రూట్లలో, ప్రతి బస్సుకు పోలీసులు ఎస్కార్ట్‌గా వెళ్లాయన్నారు. జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్




శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఆదివారం యెనుమాముల మార్కెట్ యార్డులో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసంబ్లీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఈ వి ఎం లు, వి వి ప్యాట్ల పంపిణీ ఏర్పాట్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఏఆర్ ఓ లు అశ్విని తానాజీ వాఖేడ్, సిదం దత్తు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లు ఇక్బాల్,నాగేశ్వర్ రావు, విజయ్ సాగర్ల తో పాటు రెవిన్యూ అధికారులు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై ఇసికి బిఆర్ఎస్ ఫిర్యాదు




**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో శనివారం సాయంత్రం 6 గంటలకే ప్రచార గడువు ముగిసింది. అయితే గడువు పూర్తయిన తరువాత సైతం కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై సిఇఒ వికాస్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో ఎలాంటి ప్రచారం నిర్వహించరాదు అనే ఎలక్షన్ కమిషన్ నిబంధనల్ని కాంగ్రెస్ పార్టీ ఉల్లంఘించినట్లు తమ ఫిర్యాదులో బిఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. సోమవారం (మే 13న) ఉదయం పోలింగ్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో సైతం కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని బిఆర్ఎస్ నేతలు ఇసికి ఫిర్యాదు చేశారు. టిపిసిసి సైతం సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తోందని అందుకు తగిన ఆధారాలను సమర్పించారు. ఇసి ఇచ్చిన గడువు ముగిసినా ప్రచారం చేయడంపై చర్యలు తీసుకోవాలని ఇసితోపాటు తెలంగాణ సిఇఒ వికాస్ రాజ్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా, టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాసి గౌడ్ ఇంటి వద్ద ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో హయత్ నగర్ లోని మధుయాష్కి గౌడ్ నివాసానికి చేరుకుని టీమ్ తనిఖీలు చేపట్టింది. లోక్ సభ ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మధు యాస్కి నివాసంతో పాటు పరిసర ప్రాంతాలను సైతం ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ తనిఖీ చేసినట్లు సమాచారం. వారికి అధికారులకు అక్కడ ఎలాంటి ఎన్నికల కార్యక్రమాలు జరిగినట్లు ఆధారాలు దొరకపోవడంతో వెనుదిరిగారు.

# ఖమ్మంలో కారు ప్రమాదం.. రూ.1.5 కోట్లు స్వాధీనం



**ఖమ్మం,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని కూసుమంచిలో ఆదివారం ప్రమాదానికి గురైన కారులో తరలిస్తున్న రూ. 1.5 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు నగదు సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇలాంటి మరో ఘటనలో శనివారం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో లారీని ఢీకొన్న కారు నుంచి రూ.7 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన వికాస్ రాజ్

**హైదరాబాద్,మే 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని చెప్పారు. దాంతో కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.ఆదివారం నగరంలోని యాకుత్‌పురా డీఆర్‌సీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

